క్లుప్తంగా

ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండలంలోని బసిరెడ్డిపల్లిలో ఇటీవల మృతి చెందిన కె.అంజయ్య కుటుంబ సభ్యులకు గ్రామస్తులందరూ కలిసి రూ.36,250 ఆర్థికసాయాన్ని శుక్రవారం అందించారు. సర్పంచ్ బాలగోని పర్శరాములు గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఏ నిరుపేద వ్యక్తి చనిపోయినా గ్రామస్తులు అందరం ఏకమై ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూజలు

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారంలో శాలివాహన సంఘం కులస్తులు నూతనంగా నిర్మించుకున్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠపూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గణపతి పూజ, మృత్శకా, యోగిని, వాస్తు, క్షేత్రపాలన నవగ్రహ, సర్వతో ఏకలింగతో భద్ర మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, మండల స్థాపిత దేవతా నామమంత్రి వాహనం, మంత్ర పుష్పం, హారతి తీర్థప్రసాద వితరణ పూజలను నిర్వహిచారు. అలాగే ఆలయ ఆవరణలో హోమాలను కాల్చి అందులో పలువురు జంటలు కూర్చున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇజ్జగిరి రాములు, అర్చకులు, పలువురు పాల్గొన్నారు.

బీఎస్పీ నేతల శ్రమదానం

స్టేషన్‌ఘన్‌పూర్: మే 7న నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభ కోసం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాళ్లపల్లి వెంకటస్వామి శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలో శ్రమదానం చేసి భరోసా నిధి సేకరించారు. సభ కార్యక్రమాల నిర్వహణ కోసం పార్టీ నాయకులతో కలిసి శ్రమదానం చేయగా స్థానిక జీవజలం వాటర్ ప్లాంట్ వ్యాపారి చింత దేవదాస్, తమ్మడపల్లి ఆటో యూనియన్లచే నిధి సేకరించనట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు మోకినపల్లి చక్రపాణి, రమేష్, యాకుబ్, దీపక్‌రాజ్, విజయ్ పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

రఘునాథపల్లి: గుడుంబా తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన వెల్ది క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ సీఐ భాస్కర రావు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్ది క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న గుగులోతు బిక్కును అదుపులోకి తీసుకోగా మూడు లీటర్ల గుడుంబా లభించింది. గుడుంబా స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామన్నారు.ఎక్సైజ్ ఎస్సై జలీల్, యాకుబ్‌పాషా, కలీం పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

బచ్చన్నపేట : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లిలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన పొన్నమైన నర్సవ్వ రోజూ మాదిరిగానే తన పశువులను మేత మేపుతుండగా పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. మేత మేసుకుంటూ పచ్చటి గడ్డి ఉండడంతో మేయడానికి వెళ్లిన ఆవుకు కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు.

విరాళం అందజేత

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ శోభాకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు వైశాఖ మాసం పురస్కరించుకుని పంచామృతాభిషేకం పుష్పాలంకరణ అర్చకులు వేదమంత్రాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన బోయినపల్లి సుష్మ -సురేష్‌బాబు దంపతులు ఆలయంలో అన్నదానం నిర్వహణకు ఈఓ లక్ష్మిప్రసన్న ఆధ్వర్యంలో రూ.1,01,116ల నగదును రంగాచార్యులు, కృష్ణమాచార్యులకు అందజేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జనగామ రూరల్: పట్టణంలోని 3వ వార్డులో శుక్రవారం కౌన్సిలర్ సుధా ఎమ్మెల్సీ నిధుల నుంచి ఎల్లమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వం జనగామ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ సుగుణాకర్ రాజు, కాలనీ వాసులు దూడల రమేష్, జయపాల్ రెడ్డి, అంజాజీ, సుధాకర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నర్మెట: ఎస్సీ, ఎస్టీలు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను, ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పారునంది శ్రీనివాస్, ఎస్సై షేక్ జానీపాషా, ఎంపీడీఓ ఎండీ.ఖాజా మొయినొద్దీన్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండంలంలోని గండిరామారం అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సర్పంచ్ జాల స్వేతకిషన్, వైద్యాధికారి డాక్టర్ కిషోర్, ఏఓ ధరావత్ సంతోషి, విద్యుత్ ఏఈ నర్సింగ్, ఎంఆర్ఐ సాయిబాబ, ఏపీఎం నాగేశ్వర్‌రావు, ఏపీఓ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునితాదేవి, పాల్గొన్నారు.

నేడు రజక వృత్తిదారుల మహాసభలు

జనగామ: పట్టణంలోని వైష్ణవి గార్డెన్‌లో శనివారం రజక వృత్తిదారుల సంఘం 3వ మహాసభలను నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

కొడకండ్ల : సమ్మె చేస్తున్న జూనియర్ కార్యదర్శులు



జనగామ రూరల్‌లో..



తరిగొప్పలలో..



క్రమబద్ధీకరించే వరకు పోరాడుతాం

జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్‌ను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ సర్వీస్ కల్పించే వరకు పోరాడుతామని ఆయా సంఘాల అధ్యక్ష,కార్యదర్శులు అన్నారు. జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం వద్ద స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల, దేవరుప్పుల, తరిగొప్పుల, నర్మెట, బచ్చన్నపేట, పాలకుర్తి, రఘునాథపల్లి మండలాలకు చెందిన జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



బచ్చన్నపేటలో : సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



నర్మెటలో...



పాలకుర్తిలో..



రఘునాథపల్లిలో...

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బచ్చన్నపేట : వడగళ్ల వర్షాలకు పంట నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ జనగామ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను పరామర్శించడానికి వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం వస్తున్నారన్నారు. మండలంలోని ఆలీంపూర్, గంగాపూర్, నాగిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్ గ్రామాల్లో పర్యటిస్తారని రైతులు అందరూ తమ వ్యవసాయ బావుల వద్ద ఉండాలని సూచించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వగలబోయిన శ్రీకాంత్ గౌడ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు వంశీ, నాయకులు శివ, మధు పలువురు పాల్గొన్నారు.

వడగళ్ల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలింపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మండల కార్యదర్శి బంటు పాండు, నాయకులు దండుగుల అయిలయ్య, బాలరాజు, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.



బచ్చన్నపేట : మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

దేవరుప్పుల : అకాల వర్ష బాధిత రైతులను సత్వరమే ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పయ్యావుల భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రామరాజుపల్లి, ధారావత్‌తండాల్లో పంట నష్టం ప్రాంతాలతోపాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట దశరథం, ఈశ్వరయ్య, చెన్నారెడ్డి, ఆగేష్ , నరేష్, నర్సయ్య, రాంచంద్రు, కొండయ్య, సింహాద్రి,లింగయ్య, రాజు, వజ్రమ్మ, యాదగిరి, ఉప్పలమ్మ, ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు



చిల్పూరు : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి

చిల్పూరు : రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాజ వరంలో శుక్రవారం రాజవరం మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు కాల్వ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సమావేశంలో డైరెక్టర్లు కుమారస్వామి, రాములు, వెంకటేష్, గట్టయ్య, కృష్ణమూర్తి, ఐలయ్య,యాకూబ్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరిస్తున్న జెడ్పీ చైర్మన్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ప్రొటోకాల్ విస్మరించడం ఎంత వరకు సమంజసమని పార్టీ మండల నాయకుడు మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం రాజవరంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక పక్క సీఎం కేసీఆర్ ఆత్మీయ సమావేశాలతో అందరిని కలుపుకోవాలని చెబుతుంటే మరోపక్క చైర్మన్ ప్రజాప్రతినిధులపై నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని అన్నారు. రాజవరంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి ఎంపీపీ సరిత, సర్పంచ్ తిరుమల, ఎంపీటీసీ లలితాదేవిలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వచ్చి ప్రారంభించడం ఎంతవరకు సమంజసమన్నారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతిగా, రైతు బాంధవుడిగా పనిచేస్తున్నారని ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ అన్నారు. డివిజన్ కేంద్రంలో సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సింగపురం దయాకర్, మునిగెల రాజు, ఉపసర్పంచ్ నీల ఐలయ్య, నాయకులు ఆకుల కుమార్, గట్టు రమేష్, నందిని గ్రామైక్య సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలకు పంపించాలి

బచ్చన్నపేట : 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులను ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని గోపాల్‌నగర్ లోని అంగన్ వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల ఆరోగ్యం పట్ల టీచర్లు ఎక్కువగా శ్రద్ధ తీసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్వతం మధుప్రసాద్, ఉప సర్పంచ్ వద్ది ఎల్లయ్య, వార్డు సభ్యులు తదితరులు టీచర్లు పాల్గొన్నారు.

కొడకండ్ల : మాతా శిశు సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జ్యోతి కోరారు. శుక్రవారం మైదం చెరువుతండ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేష్‌నాయక్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లిలో అంగన్‌వాడీ స్కూల్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్.సరస్వతీ, సుగుణ, ఆయాలు పాల్గొన్నారు.



కొడకండ్ల : పిల్లలకు రిపోర్టులు అందిస్తున్న ఎంపీపీ జ్యోతి

దేవరుప్పుల : ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థుకు ఇచ్చే అరుదైన పట్టామాదిరి ప్రీస్కూల్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ బస్వ సావిత్రి, తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద మడూరు, చిన్నమడూరు, సింగరాజుపల్లి, ధర్మాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ కత్తుల విజయ్, సర్పంచ్‌లు ఆకవరం సృజనారెడ్డి, వంగ పద్మ, మల్లేష్, అశోక్, విజయలక్ష్మీ, సఖీ కౌన్సిలర్ పవిత్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, అన్వరు స్నీషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం

చిల్పూరు: సురక్షిత ప్రయాణం ఆర్టీసీ బస్సుల్లోనే అని వరంగల్–1 డిపో అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్.సంతోష్ అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో శుక్రవారం ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రయాణికుల సమస్యలను తెలుపడంతో వాటిని వెంటనే పరిష్కరించినట్లు చెప్పారు. సమావేశంలో ఆర్టీసీ ఎస్పీ ఎస్ఆర్ కుమార్, సీఆర్‌సీ యాదగిరి ఉన్నారు.

ఎమ్మెల్సీ కడియం పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన ఎంపీటీసీ మొగులుగాని చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పార్టీ బృందంతో కలిసి మృతుడి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. పరామర్శించిన వారిలో సింగిల్‌విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బానోత్ రాజేష్‌నాయక్, ఉన్నారు.

అంధత్వ నివారణకు ‘కంటి వెలుగు’

బచ్చన్నపేట : అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని గ్రామాల్లోని ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నరామన్‌చర్లలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది కంటి పరీక్షలను చేయించుకోవడానికి బయటకు వెళ్లే వసతులు, స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ శిబిరాల్లో ఉచిత పరీక్షలతో పాటు కంటి అద్దాలు, మందులను అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఖలీల్‌భేగం, ఎంపీటీసీ గుర్రాల లలిత, ఉప సర్పంచ్ సిద్దారెడ్డి, నాయకులు గిరబోయిన అంజయ్య, ఆజామ్, నర్సిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాపురెడ్డి,పద్మ, నాగరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



బచ్చన్నపేట: శిబిరాన్ని ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి

జఫర్‌గఢ్: కంటి వెలుగు శిబిరాన్ని అందరు వినియోగించుకోవాలని ఎంపీపీ రడపాక సుదర్శన్, సర్పంచ్ అనిత సుధాకర్‌బాబు కోరారు. మండలంలోని తమ్మడపల్లి (ఐ)లో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు.

ముస్తాబైన ఆలయాలు

బచ్చన్నపేట : మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డినగర్, పడమటికేశ్వాపూర్ గ్రామాల్లో దుర్గామాత ఉత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేశారు. శుక్రవారం సర్పంచ్‌లు కోనేటి స్వామి, గిద్దెల రమేష్ మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఊర దేవుళ్లకు బోనాలను చేశారన్నారు. శనివారం అమ్మవారికి ఊరంతా బోనాలు చేయడం, రాత్రి వేళ ఆలయం వద్ద దుర్గామాత కథా పురాణం, కల్యాణం లాంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆదివారం వనభోజనాలకు వెళ్తారని తెలిపారు.

పార్టీ పూర్వవైభవానికి పాటుపడుదాం

దేవరుప్పుల : ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పేలా చైతన్యపరుస్తూ కాంగ్రెస్ పూర్వవైభవం కోసం పాటుపడుదామని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కడవెండిలో ఇటీవల అకాల మరణం పొందిన చేనేత కార్మికుడు చెన్నూరు కొండయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీల హంగులు, ఆర్భాటాలను చూసి పార్టీ శ్రేణులు బెంబేలెత్తొద్దని, అంకితభావం కలిగిన పార్టీ శ్రేణులు సమన్వయంతో పార్టీ పిలుపుమేరకు కార్యక్రమాలను విజయవంతం చేస్తూ పార్టీవైభవం కోసం కృషి చేద్దామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎల్లయ్య, సజ్జన్, అలీ, ఎంపీటీసీ జాకీర్, రాంబాబు,యూత్ మండల అధ్యక్షుడు యాకస్వామి, ఉన్నారు.



కొండయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న లక్ష్మీనారాయణ

కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కరువు

కొడకండ్ల : సకాలంలో ధాన్యం కొనుగోలు చేయక, సరైన వసతులు లేక కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సింగాపురం, ఏడునూతుల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతుల ఇబ్బందులు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ వర్షాలు పడుతాయని ప్రకటిస్తుంటే స్థానిక నిర్వాహకులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తూ ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మోడపల్లి సోమన్న, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాయారపు కన్నయ్య, మండల బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ఉపేందర్, రాములు, నాగయ్య, కుమార్, ఆంజనేయులు,పాల్గొన్నారు.

వైభవోపేతంగా అమ్మవారి వేడుకలు



జనగామ : పట్టణంలోని వైశ్యభవన్ ప్రాంగణంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి, నగరేశ్వర, శ్రీ సీతారామచంద్ర స్వామి ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు కనులపండువగా జరుగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు వేదపండితులు మేళ్లచెర్వు అప్పయ్య శాస్త్రీ, క్రిష్ణమాచారి సిద్ధాంతి బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పజ్జూరి గోపయ్య, కార్యదర్శి బుద్ధ రమేష్, కోశాధికారి రామిని రాజేశ్వర్, పుర ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు మంత్రికి ఆహ్వానం



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో మే 5 నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును హనుమాన్ భక్తులు ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన వారిలో ఆలయ పూజారి గంగు రఘుశర్మ, భక్తులు ఉన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉచిత సేవలు

దేవరుప్పుల : మారుమూల పల్లె ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత సేవలు అందిస్తామని ఆశ్రయం, సీసీఎం ఫౌండేషన్ ప్రతినిధులు జాన్ కెమిడి, తాళ్లపల్లి వెంకన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కడవెండిలో సర్పంచ్ పోతిరెడ్డి బెట్లీనాలీనారెడ్డి ఆధ్వర్యంలో ఫౌండేషన్ సహకారంతో ఉచిత మొబైల్ వైద్యసేవల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 300 మందికి వైద్య చికిత్సలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో కత్తుల కరుణాకర్, బాషిపాక కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో దొంగ అరెస్ట్

పాలకుర్తి టౌన్: పాలకుర్తి సర్కిల్ పరిధిలోని దేవరుప్పుల మండలం మాదాపురంలో ఈనెల 11న ఇంట్లో ఎవరూలేని సమయంలో చోరీకి పాల్పడిన ఘటనలో దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం పాలకుర్తి సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ విశ్వేశ్వర్‌తో కలిసి ఏసీపీ చోరీ ఘటన వివరాలను వెల్లడించారు. వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన బెల్లి సందీప్ దేవరుప్పుల మండలం మాదాపురంలో సుంకరి సమ్మయ్య ఇంటికి తాళం వేసి ఉందని గమనించి ఎవరూలేని సమయంలో తాళాలు పగులకొట్టి ఇంట్లో ఉన్న 3 తులాల బంగారం, రూ.60 వేలు నగదును అపహరించాడు. చోరీకి పాల్పడిన వ్యక్తి కోసం గాలించగా దేవరుప్పుల మండలం కోలుకొండలోని రాజన్న దాబా వద్ద ఎస్సై రమేష్ వాహన తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న సందీప్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. మాదాపురంలో సమ్మయ్య ఇంట్లో, కిరాణాషాపులో రూ.15 వేల విలువైన వస్తువులను తానే చోరీ చేశానని ఒప్పుకున్నాడు. అతని వద్ద దొంగిలించిన 3 తులాల బంగారంతో పాటు రూ. 55 వేలు నగదును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. దొంగిలించిన మిగతా బంగారు అభరణాలను తన తండ్రి బెల్లి సమ్మయ్య దగ్గర కొంత, తన నాన్నమ్మ బెల్లి కనకలక్ష్మీ దగ్గర దాచిపెట్టినట్లు నేరుస్తుడు తెలిపాడు. బాధితుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ విశ్వేశ్వర్, ఎస్సైలు

అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే



పాడే మోస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్ : మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన మొగులుగాని చంద్రయ్య అంతిమయాత్రలో ఎమ్మెల్యే రాజయ్య శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాడే మోయడంతో పాటు డప్పు కొట్టి చిందేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ చంద్రయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన వెంట ఎంపీపీ రడపాక సుదర్శన్, ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, ఎంపీటీసీలు జ్యోతి, రజిత, యాకయ్య, యార నీలమ్మ సోమిరెడ్డి, చిలువేరు శివయ్య, సర్పంచ్ గార్లపాటి నీరజారెడ్డి ఉన్నారు.